ఫిర్యాదులకు 1950

- పక్కా కార్యాచరణ
- కలెక్టరేట్లో కాల్ సెంటర్
- సమాచారం ఇస్తే చాలు
- 24 గంటలు పనిచేస్తుంది

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఓటరు జాబితాలో పేరు ఉందా.... నియోజకవర్గం మారాలన్న.. పోలింగ్ కేంద్రం ఎక్కడుంది అని తెలుసుకోవటం తదితర సందేహాలను ఇట్టే నివృత్తి చేస్తారు. మరోవైపు రాజకీయ పార్టీల అభ్యర్థుల తరపున ప్రలోభాలకు గురిచేసినా.. కానుకలు పంపిణీ చేస్తున్నా.. ఘర్షణలు చెలరేగే అవకాశం ఉన్నా.. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే నిమిషాల వ్యవధిలో సిబ్బంది అక్కడికి చేరి తగు చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం ముందుకు సాగుతోంది. సార్వత్రిక ఎన్నికలవేళ సందేహాల నివృత్తికి, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకు ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఒక విభాగాన్ని ఇందుకు కేటాయించారు. ఏ సందేహం ఉన్నా, ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నెంబర్ 1950 కి ఫోన్ చేస్తే సరిపోతుంది.

పక్కా కార్యాచరణ

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా, అత్యధికులు ఓటు వేసేలా, ప్రజాస్వామ్య స్ఫూర్తి చాటేలా అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల నియమావళి, ప్రచార తీరు, అభ్యర్థుల వ్యయం, తదితర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో అధికార యంత్రాంగం ఇప్పటికే పలుమార్లు సమావేశమైంది. మరోవైపు ఎక్కడా అలసత్వం వహించకుండా ఎన్నికలు సజావుగా సాగేలా పక్కా కార్యాచరణతో ముందుకెళుతున్నారు. ఇప్పటికే పలు యాప్‌లు అందుబాటులోకి రాగా, వాటిపై విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ప్రజలు తమ సందేహాల నివృత్తికి, ఫిర్యాదులు చేసేందుకు లోక్ సభ నియోజకవర్గ ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ నిర్వహణ సాగుతోంది.

సమాచారమిస్తే చాలు

మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో కలెక్టరేట్లో టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నామినేషన్ల పర్వం షురూ కావడానికి ఇంకా సమయం ఉండగా ప్రస్తుతానికి ఓటర్ల జాబితాపై సందేహాలకు సంబంధించి ఎక్కువగా ఫోన్లు వస్తున్నాయి. ఈనెల 18 నుంచి నామినేషన్ల ఘట్టం మొదలు కానుంది. ఆ తర్వాత ప్రచారం.. పోలింగ్ ప్రక్రియ సాగనున్నాయి. ఇక ప్రచారం ప్రారంభమైతే ఫిర్యాదుల సంఖ్య పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రలోభాలకు గురిచేయడం, మద్యం, నగదు పంపిణీ, వస్తువుల అందజేత, గొడవలకు ఆస్కారం తదితర వాటిపై ఫిర్యాదుకు 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేస్తారు.

24 గంటలు పని చేస్తుంది

ఎలాంటి ఫిర్యాదు అయినా చేసే వెసులుబాటు ఉంది. కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేకంగా భాగం ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు ప్రతి ఫిర్యాదును నమోదు చేస్తున్నారు. పేరు, మొబైల్ నంబర్, చిరునామా, సందేహం, ఫిర్యాదు ఇలా వివరాలు పొందుపరుస్తున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన మరుసటి రోజు నుంచి ఇప్పటివరకు ఏలూరు జిల్లాలో 300 మంది పైగా ఫోన్లు చేసి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఎక్కువగా ఓటరు జాబితాలో పేరు ఉందా, లేదా అని పోలింగ్ కేంద్రం చిరునామా తదితర వివరాలు తెలుసుకుంటున్నారు. ఓటరుగా నమోదు, చిరునామా మార్పులు, ఓటరు కార్డు డౌన్‌లోడ్ తదితర అంశాలను సిబ్బంది వివరిస్తున్నారు. దేశవ్యాప్తంగా టోల్ ఫ్రీ నంబర్ కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఫిర్యాదులు అందుతున్నా యని సిబ్బంది తెలిపారు. ఏలూరు, పశ్చిమగోదా వరి జిల్లా రిటర్నింగ్ అధికారులు, కలెక్టర్ లు వె.ప్రసన్న వెంకటేష్, సుమిత్ కుమార్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌పిలు డి. మేరీ ప్రశాంతి, అజిత్ వేజండ్ల కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, తదితర వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్నారు.

సమతావాది జగ్జీవన్‌రామ్

విశాలాంధ్ర-ఏలూరు: స్వాతంత్ర్య సమరయోధులు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ సమతోవాది.. సంస్కరణవాది అని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 116వ డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయ ప్రకాష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమని అన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో బాబు జగ్జీవనరామ్ ఒకరని అన్నారు. విద్య తోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రతి పేదవాడు విద్యావంతుడు కావాలని ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చిన మహా మనిషి అన్నారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి, జిల్లా రెవెన్యూ అధికారిణి డి.పుష్ప మణి, జిల్లా సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలను వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డిఆర్డిఏ పిడి డాక్టర్ ఆర్. విజయ రాజు, జిల్లా మైనార్టీస్ అధికారి ఎన్ఎస్ కృపావరం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో మెరుగైన పోలింగ్ శాతం సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. జిల్లాలో ఏడాదిగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేలా ఓటర్ నమోదు కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తూ అర్హులైన అందరినీ ఓటరుగా నమోదు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 14,63,014 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తే రూరల్‌లో ఎక్కువ శాతం, అర్బన్‌లో తక్కువ శాతం పోలింగ్ నమోదు అవుతుందన్నారు. పోలింగ్ రోజున ప్రభుత్వం సెలవు దినముగా ప్రకటిస్తుంది కనుక ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో ఆయా ఓటర్లకు అందుబాటులోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా నిర్భయంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసుకోవచ్చు అనీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఓటర్లను ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, డబ్బు, మద్యం, తదితర వాటినీ సీజ్ చెయ్యడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య

విశాలాంధ్ర -భీమవరం: ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడంతో పాటు ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో జరిగిన బాబు జగజ్జీవన్ రామ్ జయంతోత్సవాల కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన వసతి గృహాల ఇంజనీరింగ్ విద్యార్థులతో జిల్లా జాయింట్ కలెక్టర్ కొంత సమయం ముచ్చటించారు. వారు చదువు తున్న వివరాలు, వయసు వివరాలు పేరుపేరునా అడిగి తెలుసుకున్నారు. మీకు ఓటు ఉందా, ఎంతమందికి ఓటు ఉంది, మీ ఓటు ఎక్కడ ఉందో ఎలా తెలుసుకుంటారు అనే విషయాలపై ఆరా తీశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్‌గా నమోదు చేసుకోవడంతో పాటు, తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని హితవు పలికారు. మీ ఓట్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడం వలన మీతో పాటు మీ తల్లిదండ్రుల ఓట్లను కూడా మీరు చూసి వారికి చెప్పడానికి వీలవుతుందని తెలిపారు. ఆన్లైన్లో, ఓటర్ హెల్ప్ లైన్ ద్వారా ఓటును నమోదు చేసుకోవడం, తెలుసుకోవడం సులువైన విధానం అని ప్రతి ఒక్కరు వారి ఓటు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉందో ముందుగానే చూసుకోవాలని ఆయన తెలిపారు. కొత్తగా ఓటరుగా నమోదును ఫారం 6 ద్వారా ఆన్లైన్‌లో చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య తెలిపారు.

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు ఆదర్శనీయం

డిఈఓ అబ్రహం

విశాలాంధ్ర- ఏలూరు: సమ సమాజ స్థాపన కోసం కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ సేవలను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో అందరూ నడవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం అన్నారు. మహానేత బాబు జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం స్థానిక సెయింట్ జేవియర్ హైస్కూల్లో జరుగుతున్న స్పాట్ వేల్యూయేషన్ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి డిఈఓ ఎస్. అబ్రహం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలని ఆకాంక్షిస్తూ బాబు జగ్జీవన్ రామ్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన సేవలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలన్నారు. ఇప్పటివరకు 1.40 లక్షల పేపర్ల వాల్యుయేషన్ పూర్తి అయ్యిందన్నారు. మరొక 80వేల పేపర్లు వాల్యుయేషన్ సోమవారంతో ముగుస్తుందన్నారు. ప్రశాంత వాతావరణంలో స్పాట్ వాల్యుయేషన్ కార్యక్రమం కొనసాగుతోంది అన్నారు.

ఎస్‌టియు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆగిరిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద కొట్టాయి సెంటర్లో భారత మాజీ ఉప ప్రధాని దళిత నేత బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను, రాష్ట్రోపా ధ్యాయ సంఘం వ్యవస్థాపకులు కీర్తిశేషులు వీణా విజయరామ రాజు వర్ధంతి వేడుకలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారి ఇరువురి చిత్రపటాలకు పూలమాలలతో నివాళులు అర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్‌టియు ఏలూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తాడి నరసింహారావు, ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ హక్, సీనియర్ నాయకులు చౌటుపల్లి సురేష్ కుమార్ మాట్లాడుతూ దళితులు, అణగారిన వర్గాలు, బడుగుల రాజ్యాధికారం కోసం వారి హక్కుల కోసం, ఉప ప్రధానిగా దేశ అభివృద్ధి కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషిని కొనియాడారు. రాష్ట్రోపాధ్యాయ సంఘ వ్యవస్థాపకులు వీణా విజయరామ రాజు ఎస్‌టియు సంఘస్థాపనకు ఆయన చేసిన కృషిని, పడిన కష్టాలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఉపాధ్యాయులు ఈ రోజున అనుభవించే సౌకర్యాలలో మెజారిటీ సౌకర్యాలు వీణా విజయరామరాజు కృషి వల్లనే సాధ్యమైందని అందుకు ఉపాధ్యాయులందరూ ఆయనకు రుణపడి ఉండాలని చెబుతూ ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు ఆగిరిపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శి కోలంటి వంశీ వశిష్ట, ఆర్థిక కార్యదర్శి అంకం వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు , తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల అరెస్టు అక్రమం

విశాలాంధ్ర-ఏలూరు: ఈ నెల 3వతేదీ బుధవారం టీ నర్సాపురం మండలం అల్లంచర్ల రాజపాలెం గ్రామంలో ఫారెస్ట్ అధికారులు దళితులైన వ్యవసాయ కార్మికులను అరెస్టు చేయడాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద వ్యవసాయ కూలీలను ఫారెస్ట్ అధికారులు అరెస్టు చేయడం చాలా విచారించ దగ్గ విషయమని వారు పేర్కొన్నారు. అరెస్ట్ కాబడ్డ దళిత వ్యవసాయ కార్మికులను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతులు పిలిస్తే పనులుకెళ్లే వ్యవసాయ కూలీలను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. నిజంగా ఫారెస్ట్ ఆక్రమణకు గురైతే ఎవరైతే ఫారెస్ట్ ను ఆక్రమణ చేశారో వారిని అరెస్టు చేసి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పేద వ్యవసాయ కార్మికులపై ఫారెస్ట్ అధికారులు చర్యలకు పాల్పడటం బాధాకరమని కృష్ణ చైతన్య, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

పేట్రేగిన మట్టి మాఫియా

- యథేచ్ఛగా రాత్రివేళ మట్టి తోలకాలు
- నిబంధనలకు నీళ్లు-ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

విశాలాంధ్రం - ముదినేపల్లి : ప్రస్తుతం అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో హడావిడిగా ఉన్నారు. ఇది అదునుగా భావించిన మట్టి మాఫియా బ్రోకర్లు ముదినేపల్లి, కలిదిండి కేంద్రంగా చేసుకుని టిప్పర్లతో మట్టి తోలకాలు జోరుగా సాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఈ వాహనాల తనిఖీలు నామమాత్రంగా ఉన్నాయి. పలుకుబడి రాజకీయ నాయకులకు చెందినవని సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ఈ మట్టి రవాణా వాహనాల్లో ఏవో అదనంగా వెళు తున్నాయన్న ఆసక్తికర చర్చ సాగుతోంది. సరైన నిఘా లేకపోవడం వల్లే మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని, దుమ్ము లేపుతున్నాయని, ఒకే వే బిల్లుతో పెద్ద సంఖ్యలో తోలకాలు సహజంగానే ఉంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. పలువురి కనుసన్నల్లోనే ఈ మట్టి తోలకాలు ఊపందుకుంటున్నాయని తక్షణం స్థానిక రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం నిఘా పెంచి తనిఖీలు ముమ్మరం చేయాలని ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

విశాలాంధ్ర - పెంటపాడు: విద్య నేర్చుకున్న వారికి సమాజంలో ప్రత్యేక గౌరవం ఉంటుందని, ప్రతి దళితుడు విద్యనభ్యశించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. బిళ్ళగుంట గ్రామంలో గురువారం గ్రామస్తులందరు బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎంసి చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, డిహెచ్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కళింగ లక్ష్మణరావు హాజరయ్యారు. ఏఎంసి చైర్మన్ ముప్పిడి మాట్లాడుతూ జగ్జీవన్‌రాం అతి చిన్న వయసులోనే నేషనల్ కౌన్సిల్‌కు నామినేటెడ్‌గా ఎన్నికై 28 సంవత్సరాలకే శాసనసభ్యులుగా నియమితులయ్యారు. 40 సంవత్సరాలు ఓటమి ఎరుగని రాజకీయ నాయకునిగా, వివిధ శాఖలలో మంత్రిగా చేశార న్నారు. కార్మిక శాఖ మంత్రిగా వెనుకబడిన, దళిత కులాల వారిని రైల్వే శాఖలో ఉద్యోగాలు కల్పించారన్నారు.రైతులకు వ్యవసాయ రంగంలో కొత్త సంస్కరణలను తీసుకువచ్చిన గొప్ప నాయకుడు జగజ్జీవన్ రామ్ అన్నారు. డిహెచ్‌పిఎస్ ఉపాధ్యక్షులు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ జగజ్జీవన్ రామ్ పేదల కొరకు ఆహార భద్రత సంస్థను ఏర్పాటు చేశారని, తపాలా శాఖ మంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా వెనుకబడిన, దళిత కులాల ఎనలేని సేవ చేశారని,భారత ఉప ప్రధాని గా పని చేసిన ఏకైక దళిత నాయకునిగా బాబు జగజ్జీవన్ రామ్ చరిత్ర లో నిలిచిపోయారన్నారు.ఈ కార్యక్రమంలో పెంటపాడు మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులు జాలపర్తి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు కిలాడి రామయ్య, యజ్జల రామారావు, శ్రీను, యూత్ కమిటీ సభ్యులు మొర్ల రాజేష్, వై.పండు, వై.శ్రీనివాస్ ఎం.కిరణ్ ఎం.శేఖర్ వై.గాంధీ కే.జాన్. కే.బాలస్వామి, కే.గణేష్, సిహెచ్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టీ నరసాపురం: మహిళను లైంగిక వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తిరుమల దేవిపేట పంచాయతీలోని వెంకటాపురం గ్రామానికి చెందిన షెడ్యూల్ కులానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన అగ్ర కులానికి చెందిన వ్యక్తి గత కొంతకాలంగా ఆమె వెంటపడుతూ ఇంటి చుట్టూ తిరుగుతూ తన కోరిక తీర్చమని వేధిస్తున్నట్లు మహిళ ఫిర్యాదు చేసింది. ఆ వ్యక్తిపై లైంగిక వేధింపులు,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త

విశాలాంధ్ర-కుక్కునూరు: బాబు జగజ్జీవన్ రామ్ గొప్ప సంఘసంస్కర్త అని దళిత సంఘం మండల నాయకులు మడుపల్లి రమణయ్య అన్నారు. జగజ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు సీతారామ నగరం (ఎస్‌సి) కాలనీలో ఘనంగా జరిగాయి. జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మడుపల్లి రమణయ్య మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన డాక్టర్ జగజ్జీవన్ రామ్ నాటి కుల సమాజ అణచివేతను ప్రత్యక్షంగా చూసి ఆ అణచివేతను అధిగమిస్తూనే భారత స్వాతంత్ర పోరాటంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసిన మహనీయుడని కొనియాడారు. భారత పార్లమెంటులో 40 సంవత్సరాల పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించి ఆ పదవులకే వన్నెతెచ్చిన గొప్ప సమతా వాది అన్నారు. ఆయన మన మధ్య లేకపోయినా, ఆయన సిద్ధాంతాలు, ఆశయాలు ప్రజల మనసులలో నేటికీ సజీవంగా చిరస్థాయిగా నిలిచి ఉన్నాయని తెలిపారు. ఆయన ఆశయాలను ఆచరించటమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము వీరబాబు, కొమ్ము ప్రవీణ్, రాయి రమణయ్య, కాకాని చంద్రశేఖర్, కదారి ఆదెమ్మ, బొక్కసాని వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సుగుణమ్మ మృతి మహిళా సమాఖ్యకు తీరని లోటు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు)రాష్ట్ర కార్యవర్గ సభ్యు రాలు, నంద్యాల జిల్లా ఎన్ఎఫ్ఐడబ్ల్యు మాజీ కార్యదర్శి, అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర నాయకురాలు సుగుణమ్మ మృతి రాష్ట్ర మహిళలందరికీ తీరని లోటని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సుగుణమ్మ ఉమ్మడి కర్నూలు జిల్లాలో అంగన్‌వాడి సమస్యలపై, మహిళా సమాఖ్య నాయకురాలుగా ఎంతోమంది మహిళల సమస్యలపై పోరాడారని కొనియాడారు. ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించి మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారని తెలిపారు. మహిళల సమస్యలపై తక్షణమే స్పందించి వారికి వెన్నుదన్నుగా నిలబడేవారన్నారు. ఇటీవల నంద్యాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం ఆవిడ ఎంతగానో కృషి చేశారన్నారు. ఎన్నో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సమావేశాలకు హాజరై మహిళల సమస్యలపై అనేక సూచనలు చేసేవారని తెలిపారు. సుగుణమ్మ మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ ఆవిడ కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా సమితి నుండి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఇండియా కూటమితో అభివృద్ధి

విశాలాంధ్ర -భీమవరం: ఇండియా కూటమి నేతృత్వంలో దేశం, రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు అన్నారు. భీమవరం అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి అంకెం సీతారామ్‌ను సీపీఐ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు సోవియట్ రష్యా సహకారంతో భారత్‌ను అభివృద్ధిలో పరుగులు పెట్టించాయని గుర్తుచేశారు. యుపిఎ-1 హయాంలో మళ్లీ దేశాన్ని అగ్రపథంలో నిలిపామని చెల్లబోయిన అన్నారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో దేశం వందేళ్ల వెనక్కు వెళ్లిందని పదేళ్లలో దేశంలో అరాచక పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అంకెం సీతారామ్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానని, త్వరలో ఉమ్మడి ప్రచారంకు రోడ్ మ్యాప్ సిద్ధం చేద్దామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లుల శ్రీనివాసరావు, వై.వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు పెన్షన్ పెంచాలి

విశాలాంధ్ర-కామవరపుకోట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాల్లో భాగంగా రంగస్థల కళాకారులు కూడా సంక్షేమ పథకాలు అందేలా వివిధ వృత్తుల వారికి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను కళాకారులకు అందజేయాలని ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు కోరారు. కళాకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు రూపొందించి అధికార ప్రతిపక్ష పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలు రంగస్థల కళాకారులకు లబ్ధి చేకూరే విధంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని కోరారు. సీనియర్ కళాకారులు ఇస్తున్న 3000 పెన్షన్ 6000 రూపాయలు చేయాలని కోరారు. పలువురు బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, జానపద కళాకారులు ఎల్ఆర్ కృష్ణబాబు, మహిళా బుర్రకథ కళాకారిణి విభూది రాజేశ్వరి తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

ఎంపీడీవో కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి

శాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో దివంగత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ 116 వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కే.వి.ప్రసాద్ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి గోపాకృష్ణ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు .

కుల నిర్మూలనకు కృషిచేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-భీమవరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, కార్మికుల అభ్యున్నతి, కుల నిర్మూలనకు అహర్ని శలు కృషి చేసిన మహనీయులు బాబూ జగ్జీవన్ రామ్ అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు.బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య తదితరులు పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి వెలిగించి వేడుకలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తూనే కుల నిర్మూలన ఉద్యమాలు నడిపిన గొప్ప నాయకులుగా బాబూ జగ్జీవన్ రామ్ చరిత్రలో నిలిచిపోయారని కలెక్టర్ తెలిపారు. తన జీవిత కాలం సామాజిక సేవలోనే నిలిచారన్నారు. రాజకీయ రంగంలోనూ ప్రవేశించిన ఆయన వివిధ పదవుల్లో సమర్థంగా పని చేశారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు సమానత్వంతో ఉండాలనే లక్ష్యంతో బడుగు బలహీన వర్గాలతో పాటు స్త్రీలకు కూడా విద్య విషయంలో అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు తమ పిల్లలను ఉన్నత విద్యను చదివించాలని, అప్పుడే అటువంటి మహాత్ముల ఆశయానికి సార్థకత చేకూరుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. సుమారు 30 సంవత్సరాలు కేంద్ర మంత్రి గాను, ఉపప్రధాని మంత్రిగా పని చేయడం గొప్ప విషయ మన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.శోభారాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పాపారావు, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ సిహెచ్ దుర్గ ప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది, సాంఘిక సంక్షేమ సాధికారత శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు రాకపోవడంతో గ్రామస్తుల నిరసన

విశాలాంధ్ర-లింగపాలెం: అన్నపనేని వారిగూడెంకు వచ్చే ఆర్టీసీ బస్సు సకాలంలో రాకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు ఆపి దాని ముందు నిరసన చేశారు. రాత్రి సమయంలో గ్రామంలో బస్సు నిలిపే వారని, కొంతకాలంగా బస్సును నిలపడం లేదని దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆరోపించారు. ఈ గ్రామం నుంచి బయటికి వెళ్లేందుకు వాహన సదుపాయాలు లేవని వీరు పేర్కొన్నారు. బోగోలు, కలరాయనగూడెం, బాపిరాజుగూడెం, రామచంద్రపురం నుంచి ఏలూరు వెళ్లు తుందని ఇదే మార్గంలో వస్తుందని తెలిపారు. కొన్ని రోజులుగా బస్సు సరిగా రావడం లేదని వీరు ఆరోపించారు. సకాలంలో ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా బస్సు సర్వీసును నడపాలని కోరారు. గ్రామస్తులకు మద్దతుగా మాల మహానాడు నాయకుడు సరిపల్లి రవితేజ నిరసనలో పాల్గొ న్నారు. ఆర్టీసీ అధికారులతో ఫోన్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా బస్సును నడిపిం చాలని కోరారు. తమ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఈయనతో పాటు స్థానికులు అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎండతాపానికి అల్లాడుతున్న ప్రజలు

విశాలాంధ్ర-లింగపాలెం : భానుడి తాపానికి లింగపాలెం మండల ప్రజలు అల్లాడుతున్నారు. ఎండకు భయపడి ఇళ్లనుంచి బయటకు రాలేకపోతున్నారు. ఇళ్లల్లో ఉన్నవారు కూడా ఎండతాపానికి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు ఇళ్లకే పరిమితమయ్యారు. కూలి పనులకు వెళ్లే వారంతా ఎండకు వెళ్లలేక ఇళ్లల్లోనే ఉండిపోతున్నారు. శుక్రవారం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండకు భయపడి వ్యాపారస్తులు తమ దుకాణాలను మూసి వేశారు. గ్రామాలు,పల్లెల్లో ఎండ ప్రభావం ప్రజలపై చూపింది. ఏలూరు, చింతలపూడి ప్రధాన రహదారి, గ్రామాలకు వెళ్లే రహదారులు రాకపోకలు లేక నిర్మానుష్యంగా ఉన్నాయి. ప్రజలంతా ఎండకు భయాందోళన చెందుతున్నారు. అనేకమంది వడదెబ్బ వల్ల అస్వస్థతకు గురయ్యారు. ఎండ అధికంగా ఉండటంతో లింగపాలెం మండల వైద్యాధికారి కృష్ణ కిషోర్ పలు సూచనలు చేశారు. ఎండల్లో తిరగవద్దని, ఉదయాన్నే పనులు ముగించుకోవాలని తెలిపారు. మంచినీరు, ఆరోగ్యమైన ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. ఎండ వల్ల అనారోగ్యానికి గురైతే ధర్మాజీగూడెం, లింగపాలెం, కే గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక చికిత్స శిబిరాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కేంద్రాలలో పూర్తిస్థాయిలో వైద్యాన్ని అందిస్తామని అన్నారు.

సహజ పానీయాలే ఆరోగ్యానికి శ్రేయస్కరం

విశాలాంధ్ర-టీ నరసాపురం: టీ నరసాపురం పంచాయతీలో కృష్ణా పురం గ్రామం పంచముఖ గుడి సెంటరులో బంజారా బజరంగీ భేరి,భూక్యా గోపయ్య సక్రమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను జరభల చందా నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భూక్యా గోపయ్య, సక్రమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు భూక్యా వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాలు దోహదపడతాయని అన్నారు. ప్రజలు ప్రమాదకరమైన శీతల పానీయాలు త్రాగడం ఆరోగ్యానికి మంచిది కాదని, ఆరోగ్యానిచ్చే సహజమైన మజ్జిగ, నిమ్మరసం, పళ్ళ రసాలు తీసుకుని వడబెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జరభల పూర్ణయ్య, దేశావత్ వెంకట్ ,భూక్యా గాంధీ, సవరం రామదాసు,భూక్యా శ్రీనివాస్ ,భూక్యా సురేష్ ,ధరావత్ బంగారు బాబు,భూక్యా సత్యం, భూక్యా భిగనాదం, హసావత్ వెంకటేశ్వరరావు, జరభల విజయ్, భూక్యా భద్రమ్మ, ధన లక్ష్మి, హిమజ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ దేశానికి ,అణగారిన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటి యూసి అనుబంధం)జిల్లా అధ్య క్షుడు కె.విఘ్నేష్ అన్నారు. బాబూ జగజ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా స్థానిక ఏలూరు రోడ్డులోని బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగజ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పారిశుధ్య విభాగం అధ్యక్షుడు కొత్తూరి నాగేశ్వరరావు, కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, రేలంగి నాగరాజు, పితాని సురేష్, కొత్తూరి శ్రీను, ముప్పిడి శ్రీను, కలపాల యేసు తదితర కార్మికులు పాల్గొన్నారు.

వాహనాలను పరిశీలించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-కామవరపుకోట : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలను పరిశీలించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వాహనాలను ఆపి స్వయంగా పరిశీలన చేశారు. చెక్ పోస్ట్ రిజిస్టర్ పుస్తకాలను పరిశీలించారు. వాహనాల నెంబర్లను తప్పనిసరిగా గుర్తించాలని, మద్యం, నగదు, గిఫ్ట్ రవాణా అడ్డుకోవాలని సూచించారు.

బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప దార్శనికుడు

విశాలాంధ్ర-ఏలూరు: జీవితమంతా దేశ సేవకే అంకితమై నవభారత నిర్మాణానికి పునాదులు వేసిన బాబు జగ్జీవన్ రామ్ గొప్ప దార్శనికుడని టిడిపి ఏలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కొనియాడారు. బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా

స్థానిక పవర్ పేట బడేటి క్యాంపు కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి బడేటి చంటి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ ఆలోచనల్లోని పరిపక్వత, మాటల్లోని సూటిధనం, నిర్ణయాల్లో లోతైన అవగాహన, కష్టాల్లో కృంగిపోక మొక్కవోని ధైర్యం, చర్చల్లో పదునైన మేధావితనం ఆయన సొంతం అన్నారు. ప్రత్యర్థులతో సైతం ఔరా అనిపించే రాజనీతిజ్ఞత, తర్కం, లోతైన విషయ పరిజ్ఞానం వంటి నాయకత్వ లక్షణాలు కలిగి ఉండేవారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ, మాజీ ఎంపీపీ లంకలపల్లి మాణిక్యాలరావు, పెద్దాడ రమణ, మెలిపాక వెంకన్న, చౌటుపల్లి శ్రీను, బయ్యారపు కుటుంబరావు, వినుకొండ శ్యామల రావు, క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జుంజు మోజేష్, నగర ఎస్ సి సెల్ అధ్యక్షులు వెంకటరమణ, చాట్ల శ్రీనివాస్, మేతర అజయ్ బాబు, గుంటూరు ప్రకాష్, యోహాన్, దళిత నాయకులు, వివిధ హెూదాలలో ఉన్న తేదేపా నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో : దళితుల అభ్యున్నతికి కృషి చేసిన బాబు జగజ్జీవన్ రామ్ సేవలు మరువ రానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగజ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలు ముదినేపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. చేవూరు దళితవాడలో

ఉన్న బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి వైసీపీ రాష్ట్ర నాయకులు నిమ్మగడ్డ బిక్షాలు , వైస్ ఎంపీపీ చొప్పల సునీత, టిడిపి నాయకులు కొడాలి వినోద్, దావు నాగరాజు, పంతగాని సురేష్, జనసేన నాయకులు వీరంకి వెంకయ్య , మోటేపల్లి హనుమ, వడ్డాని ఆంజనేయులు, పాతూరి వంశీకృష్ణ, సుధీర్ లు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్లు పంచారు. అనంతరం గ్రామాల్లో జగజ్జీవన్ రామ్ యూత్ ఆధ్వర్యంలో మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

కొయ్యలగూడెంలో: భారత దేశ ఉప ప్రధాని కీ.శే. బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను మండల కేంద్రమైన కొయ్యల గూడెం ఎస్సీ కాలనీలో జగ్జీవన్ రామ్ యూత్ అధ్యక్షులు బొబ్బర చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు

లు అర్పించారు. ఈ సందర్భంగా ముప్పిడి చినబాబు మాట్లాడుతూ అణగారిన వర్గాలలో జన్మించి ఉన్నతమైన చదువులు అభ్యసించి రక్షణ శాఖ మంత్రిగా తన సేవలను అందించి భారతదేశ ఉప ప్రధానిగా పరిపాలన చేశారని తెలిపారు. యూత్ సభ్యులంతా కలిసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ పులపల్లి రవికుమార్, చెప్పుల మధుబాబు, నైనవరపు గోపి, బొబ్బర సుబ్బారావు,పులపాకుల దుర్గారావు, పాటిబండ్ల వెంకట్రావు, పాత కాకుల శ్రీను, బొబ్బర రమేష్, ఊసల రాజేష్,పురిటి గడ్డ వెంకటేష్, కోడెల్లి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో : కొయ్యలగూడెం ఎస్సీ కాలనీఆలోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జనసేన పార్టీ నాయకులు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువు

కోవడం వలన భారతదేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆశయాలను నెరవేర్చవచ్చని ఆయన పేర్కొన్నారు. ముందుగా జనసేన పార్టీ నాయకులు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, సరిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ తాడేపల్లి వీర వెంకట కృష్ణ , చోడి పిండి సుబ్రహ్మణ్యం, దుగ్గిన శ్రీనివాస్, ఏపూరి సతీష్, మేకల సత్య తేజ, చెప్పుల మధుబాబు, వరద రామకృష్ణ, మేడిన కన్నయ్య, నక్క బాబి, గొలిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: బహుజనుల ఆశాజ్యోతి బాబూ జగజ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని మాజీ ఎమ్మెల్యే, జనసేన అసెంబ్లీ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం జనసేన ఎన్నికల శిబిరంలో బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా

నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పులపర్తి మాట్లాడుతూ భీమవరంలో స్థలం కేటాయించి జగజ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం నెలకొల్పడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కా సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎద్దు ఏసుపాదం, టిడిపి జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మైలాబత్తుల ఐజాక్ బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, నాయకులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, యాళ్ల వెంకటేశ్వర రావు అనపర్తి కృష్ణ ప్రసాద్, గంట త్రిమూర్తులు, మద్దుల రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తణుకులో : అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్‌కు తణుకు మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ నివాళులర్పించారు. సుమారు 30 సంవత్సరాల పాటు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశానికి సేవలు అందించారని

ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేశారని రాధాకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం తణుకు పట్టణంలో ఆరిమిల్లి రాధాకృష్ణ నాయకత్వంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు బాబు జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. పట్టణంలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, తణుకు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ నేతృత్వంలో టిడిపి కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి అబ్బు దాసరి లాజర్, తణుకు పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చలవాద నాని, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కార్యదర్శి తామరపు రమణమ్మ, షేక్ సూరా సాహెబ్, తాతపూడి మారుతీరావు, ఒమ్మి రాంబాబు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో : స్వాతంత్ర్య సమరయోధుడు , మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ సబ్ డివిజన్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రొక్కాల నాగ బుజ్జి అన్నారు. తాడేపల్లిగూడెం లోని ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ



కార్యాలయం వద్ద జగ్జీవన్ రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని జగ్జీవన్ సేవలను స్మరించుకున్నారు. అత్యంత పేదరికంలో జన్మించిన జగ్జీవన్ రామ్ అత్యున్నత స్థానానికి ఎదిగారని పేర్కొన్నారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు దళితుల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ ఎంతగానో పాటుపడ్డారని రొక్కాల నాగ బుజ్జి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ రొక్కాల ఆశీర్వాదం, టీచర్ కె. కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోడూరులో : దళితుల ఆత్మబంధువు, ఆరాధ్యుడు, భారతదేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ 116 వ జయంతి సందర్భంగా శుక్రవారం మండలం లోని తూర్పు పాలెం క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటా నికి ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథ

రాజు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ప్రధానిగా పని చేసిన డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ సంఘ సంస్కర్త గా వెనుక బడిన వర్గాల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. మండల వైసీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూజివీడులో : జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శుక్రవారం నూజివీడులో ఘనంగా నిర్వహించారు. నూజివీడులోని పలు రాజకీయ పక్షాలకు చెందిన కార్యాలయాల్లో జగజ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించి

ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ అభ్యర్థి, నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, తెలుగుదేశం అభ్యర్థి కొలుసు పార్థసారథి, నూజివీడు ఇండిపెండెంట్ అభ్యర్థి ముద్రబోయిన వెంకటేశ్వరరావు తమ తమ కార్యాలయాల్లో జగజ్జీవన్ రామ్ కు నివాళులర్పించారు.

టి నరసాపురంలో : యువత బాబూ జగజ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పోలవరం శాసన సభ్యులు తెల్లం బాలరాజు తెలిపారు. కె జగ్గవరం గ్రామంలో బాబూ జగజ్జీవన్ రామ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ

జగజ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాల రాజు మాట్లాడుతూ బాబూ జగజ్జీవన్ రామ్ ఉప ప్రధాన మంత్రిగా, కేంద్ర మంత్రిగా భారత పార్లమెంటులో 40 ఏళ్ళ పాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించి దేశానికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో బాబూ జగజ్జీవన్ రామ్ ఒకరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీను రాజు,వైసిపి ఏలూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, కేతవరం సర్పంచ్ తడికలపూడి శివ మాధవి కిషోర్ కుమార్,రాజు పోతే పల్లి ఎంపిటిసి బొడ్డపాటి రాంబాబు, ఎంఆర్పీఎస్ పోలవరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి బర్రె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో : బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి కార్యక్ర మం, పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జరి గింది. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు యడ్ల శివాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాలకొల్లు నియోజక

వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు, జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాబు జగ్జీవన్ రామ్, భారతదేశంలో అట్టడుగు వర్గ ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాల అధ్యక్షులు జి.మోహనరావు, రొక్కాల బెన్నిపాల్ బొలిశెట్టి భానుప్రకాష్, వర్ధనపు కాసులు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వై. నామగిరి, యలమర్తి మోహనరావు, ఎం. గోపాలం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గణపవరంలో : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీని వాసరావు (వాసుబాబు) అన్నారు. శుక్రవారం గణపవరం మండలం, కోమట్లపాలెం గ్రామంలో బాబు జగజ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ

మారుమూల గ్రామంలో పేద కుటుంబంలో జన్మించి భారత దేశ ఉపప్రధానిగా పదవి చేపట్టి దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పారన్నారు. ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన అడుగు జాడల్లో నడచి ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ టీ షర్ట్ ఫెడరేషన్ జిల్లా నాయకులు కాకర శ్యామ్ సుందర్ (సన్), ఇందుకూరు వెంకట నరసింహారాజు (ఐవి రాజు), వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో : 50 సంవత్సరాలు సుదీర్ఘంగా పార్లమెంటు సభ్యులుగా ఉండి 40 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా విశేష సేవలందించి దేశ అభివృద్ధికి పాటు పడిన మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ సేవలు మరువలేనివనీ వైసీపీ నాయకులు

జెట్టి గురునాధరావు అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎస్సీ పేట, నవ చైతన్య అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఈ సేవా కేంద్రం సమీపంలో ఏలూరు రోడ్డు నందున్న బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వైసీపీ నాయకులు జెట్టి గురునాధరావు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు జెట్టి గురునాధరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా భారత దేశ మాజీ ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రిగా, దేశానికి విశేషమైన సేవలు అందించి దేశ అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైసీపీ నాయకులు ముప్పిడి శ్రీనివాసరావు, కౌన్సిలర్ లు నేకూరి కిషోర్, దిరిసిపోము రాజేష్, వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో: అతి చిన్న వయస్సులోనే నేషనల్ కాంగ్రెస్ కౌన్సిల్ ద్వారా శాసనసభ్యునిగా బాబు జగ్జీవన్‌రామ్ నియమింపబడ్డారని టిడిపి ఇన్‌చార్జి వలవల బాబ్జి, ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలం ఉమా మహేశ్వరం గ్రామంలో గురువారం గ్రామస్తులందరు బాబు జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ



కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి పార్టీల అసెంబ్లీ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి బాబ్జీ హాజరై జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జీలు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రంగంలో కొత్త సంస్కరణలను తీసుకువచ్చిన మహనీయుడు జగజ్జీవన్ రామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, వర్తనపల్లి కాశి, దాసరి అప్పన్న,పాతూరి రాంప్రసాద్ చౌదరి, పుల్లా బాబి, గంధం సతీష్, మద్దుకూరి రామకృష్ణ, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉమామహేశ్వరం గ్రామస్థులు పాల్గొన్నారు.

గణపవరంలో : గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ,2 ఆధ్వర్యంలో శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్117వ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వైస్ ప్రిన్సిపల్ పి. మధురాజు అధ్యక్షత వహించి, బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి



పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. వెంకటరమణ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ 1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యాడని, జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతిచిన్నవయసులోమంత్రయ్యాడని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది ఐ.క్యు.ఏ.సీ కోఆర్డినేటర్ డా.సిహెచ్.చైతన్య, డా.టీ.అక్కిరాజు , డా.కె.స్వరూప రాణీ, ఎన్.వి ఎన్.బి శ్రీనివాసరావు, డా.జి వెంకట్రావు, మొయిన్ అన్సారి, షేక్ పర్వీన్, రాణి దుర్గ, బాల మణికంఠ , వెంకన్నబాబు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ అవినీతి పాలనలో వ్యవస్థలు సర్వనాశనం

విశాలాంధ్ర-దెందులూరు: పరిపాలన పట్ల కనీస అవగాహన లేకుండా, దోచుకోవడమే లక్ష్యంగా జగన్ అవలభించిన విధానాల వల్ల రాష్ట్రం సర్వ నాశనం అయ్యిందని దెందులూరు నియోజకవర్గ టిడిపి బిజెపి జనసేన కూటమి అభ్యర్థి చింతమనేని

ప్రభాకర్ తెలిపారు. మండలంలో దెందులూరు గ్రామంలో జరిగిన టిడిపి, బిజేపి,జనసేన విస్తృత స్థాయి సమావేశంలో చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఏలూరు ఎంపి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ నీ పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రంలోని యువత ఉపాధి దొరకక వలస వెళ్లి పోతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి లేదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మొత్తం చిన్నాభిన్నం అయ్యిందన్నారు. అధికారంలోకి వచ్చే వరకు మాయ మాటలు చెప్పి జగన్ ప్రజలను నమ్మ బలికాడని, ఫించన్లు రూ.3 వేలు ఇస్తాను అని గత ఎన్నికల నాడు చెప్పి, జనవరిలో మళ్ళీ ఎన్నికలు వస్తున్నాయని 3వేలు ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపి అభ్యర్థి పుట్ట మహేష్ యాదవ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, దెందులూరు మండల పార్టీ అధ్యక్షులు మాగంటి మిల్లు బాబు, బిజెపి పార్లమెంట్ అధ్యక్షులు కాట్నేని లక్ష్మీ కృష్ణ ప్రసాద టిడిపి జనసేన బిజెపి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీరు వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకంకాదు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వాలంటీర్లకు రాబోయే కూటమి ప్రభుత్వంలో న్యాయం చేస్తామని, వాలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదని, రాజకీయాలు చేసే వాలంటీర్లకు మాత్రమే టీడీపీ వ్యతిరేకమని రాష్ట్ర

టిడిపి ఆర్గనైజింగ్ సభ్యురాలు మేఘలాదేవి అన్నారు.వాలంటీర్లను రెచ్చగొట్టి జగన్ రెడ్డి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారని, పేదలు, వృద్ధులు, వికలాంగుల పింఛన్లతో జగన్ రెడ్డి కొత్త డ్రామా ఆడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులే లబ్దిదారులకు ఇంటివద్దకే పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించినా జగన్ రెడ్డి ఎందుకు భేఖాతరు చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామంలో సగటున 45 మంది పింఛన్‌దారులకు.. ఇంటింటికీ వెళ్లి రోజుకు 20 పింఛన్లు ఇచ్చినా రెండు రోజుల్లో మొత్తం పింఛన్లు పంపిణీ పూర్తిచేయొచ్చునని అన్నారు. ఇంటింటికీ రూ.4 వేల పింఛన్ ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్త రమ, దొడ్డపనేని దుర్గ దేవి, నల్లపర్తి ఝాన్సి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో టీడీపీ

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి సతీమణి కొలుసు లక్ష్మి కమల శుక్రవారం నూజివీడు మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు ప్రజలతో

ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రధానంగా మహిళలపై పెరిగిన దాడులను వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం నిర్వహించి టిడిపి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భీమవరం అభివృద్ధిలో భాగం పంచుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం నియోజకవర్గం అభివృద్ధిలో అందరూ భాగం పంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన అధ్యక్షులు

కొటికలపూడి గోవిందరావు అన్నారు. పట్టణంలోని 7,26 వ వార్డులకు చెందిన వైసిపి నాయకులు గనిసెట్టి సీతారామయ్య, రమేష్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది శుక్రవారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకర రవి, పత్తి హరి,మాజీ కౌన్సిలర్స్ మాగాపూ ప్రసాద్, వానపల్లి సూరిబాబు నాయకులు రామాయణం శ్రీను, కాళి శేఖర్, ఎస్.ఎస్. గిరి, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిపిఆర్‌టియు సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-ఏలూరు: డి పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డిఇఓ అబ్రహం ప్రారంభించారు.ఈ సందర్భంగా డి పి ఆర్ టియు సంఘం చేస్తున్న సేవలను ఆయన అభినందించారు.డి

పిఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి తీవ్రత ఎక్కువగా ఉందని, ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు స్పాట్ విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు మజ్జిగ పంపిణీని తమ సంఘం సేవా కార్యక్రమంగా నిర్వహిస్తోందని అన్నారు.కార్యక్రమంలో పరీక్షలు విభాగం అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, ఎం ఈ ఓ బుధవాసు, డి పి ఆర్ టి యు రాష్ట్ర సలహాదారు ఎం అచ్యుతరావు, రాష్ట్ర అధ్యక్షులు పి వెంకటేశ్వరరావు, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.చంద్రశేఖర్ అజాద్, ఎం. రాంబాబు, నాయకులు నాగేంద్ర సింగ్ ,వెంకట్,ఆర్ ఎన్. వెంకటేశ్వరరావు, అప్పారావు ,సూర్యచంద్రరావు ,రమేష్, పి.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి కృష్ణబాబు రాజీనామా

విశాలాంధ్ర - కలిదిండి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నున్న కృష్ణబాబు పార్టీకి గుడ్ బై చెప్పి ఎన్‌డిఎ కూటమిలో చేరారు. శుక్రవారం కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, కలిదిండి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పోకల జోగిరాజు ఆధ్వర్యంలో ఎన్‌డిఎ కూటమిలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణబాబు, ఎన్‌డిఎ కూటమిలోకి రావడం చాలా సంతోషంగా ఉందని, రాష్ట్ర భవిష్యత్తు మన బాధ్యత అన్నారు. గత పదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం కోసం అహర్నిశలు కృషి చేసినా తగిన గుర్తింపు పార్టీ ఇవ్వలేదని, పార్టీ వర్గ విభేదాలు పోషిస్తుందని కృష్ణబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని శ్రీనివాస చౌదరి, నల్లగొలపు చలపతి, బురుబోయిన శ్రీనివాసరావు, నున్న రమాదేవి, పైడిపాటి శివ శంకర్, బోయిన శ్రీను, బోయిన శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా అందిన 583 అభ్యర్థనలకు అనుమతులు జారీ

ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు: జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ /ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్థనలలో ఇంతవరకూ 583 అనుమతులు ఇవ్వటం జరిగిందని, శుక్రవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలక్టరేట్‌లో

జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించమన్నారు. వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యములో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటూన్నమన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా గురువారం రాత్రి వరకు 862 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకూ 583 అనుమతులు జారీ చేయగా మరో 8 పరిశీలనలో ఉన్నాయన్నారు. సరైన రీతిలో దరఖాస్తు చేయబడని 271 తిరస్కరించబడ్డా యన్నారు. సి-విజిల్ ద్వారా 259 ఫిర్యాదులు అందగా వాటిలో 162 ఫిర్యాదులను పరిష్కరించా మన్నారు మరో 97 ఎన్నికలకు సంబంధం లేని ఫిర్యాదులు తిరస్కరించబడ్డాయన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 79 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు.ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెసేజ్/ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలకు అధికార యంత్రాంగానికి అందించాలని కోరారు. దీనికి వాట్సాప్ నెంబర్ 9491041435 అందుబాటులో ఉంచామని, ప్రజలు దీన్ని వినియోగించుకుని ప్రశాంతవాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఫిర్యాదులు నమోదు కోసం కలెక్టరేట్ కాల్ సెంటర్ నెంబర్ 1800 233 1077 ఏర్పాటు చేశామన్నారు.

చెక్ పోస్టలలో తనిఖీలు పక్కాగా చేపట్టాలి

విశాలాంధ్ర-కామవరపు కోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట లలో వాహనాల తనిఖీ పక్కాగా చేపటాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కామవరపుకోట వద్ద

ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్ లను పరిశీలించి, స్టాటిక్ సర్వేలెన్స్ టీం కి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ బృందాలతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఇంతవరకు రు. 148.02 లక్షల నగదు, మద్యం,తదితరాలు స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. ఇందులో రూ. 88.05 లక్షలు నగదు, రూ. 56.10 లక్షల విలువైన మద్యం స్వాధీన పరచుకున్నామన్నారు. తనిఖీల ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా జిల్లావ్యాప్తంగా పటిష్టమైన నిరంతర నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 46 ఫ్లైయింగ్ స్క్వాడ్ లు,10 సర్వేలెన్స్ టీం లను రాష్ట్ర సరిహద్దులవద్ద, మరో 28 సర్వేలెన్స్ టీం లను ఇతర ప్రాంతాలలో, 24 వీడియో సర్వేలెన్స్ టీం లను ఏర్పాటు చేశామన్నారు. కామవరపు కోట అసిస్టెంట్ అధికారి, తహసీల్దార్ జెవిఆర్ రమేష్ మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో 102 వాహనాలను తనిఖీ చేశామని,రూ. 79 వేల నగదు స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ఇక్కడ ఇంతవరకు రూ. 9 లక్షల నగదును స్వాధీనపరచుకున్నామన్నారు.

హోం ఓటింగ్ పై అవగాహన

విశాలాంధ్ర - పెంటపాడు: పెంటపాడు మండలంలోని బూత్ స్థాయి అధికారులతో మండల సమావేశం మందిరంలో గురువారం తాడేపల్లి గూడెం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కే.చెన్నయ్య హెూమ్ ఓటింగ్ పై అవగాహనా సమావేశం

నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 80 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, 40 శాతానికంటే వైకల్యం ఎక్కువ గల దివ్యాంగులు, కోవిడ్ రోగులు, ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు ఫారం-12డి ద్వారా తమ పోలింగ్ కేంద్రం బిఎల్ వో లకు లేదా ఆర్వోలకు ఫారం-12డి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, తద్వారా అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఇంటి వద్దనే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పిస్తారని తెలిపారు.ఈ ప్రక్రియ అంతా ఇద్దరు పోలింగ్ అధికారులు, పోలీస్ అధికారితో పాటు ఓ వీడియో గ్రాఫర్ సమక్షంలో జరగనుందని తెలిపారు. అర్హులైన వయోవృద్ధులు, దివ్యాంగులు, కోవిడ్ రోగులు, ఆరోగ్య అత్యవ సర పరిస్థితుల వారు సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి చెన్నయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఉన్న తహసీ ల్దార్ సురేష్ బాబు, ఎంపీడీవో బాలాజీ వెంకటరమణలు పాల్గొన్నారు.

కాలనీ ఇళ్ల నిర్మాణానికి ఉపాధి పథకం నిధులు అందజేత

విశాలాంధ్ర- లింగపాలెం: పేదల ఇళ్ల నిర్మాణానికి ఉపాధి పథకం ద్వారా మంజూరు చేసిన నిధులు లబ్దిదారులకు అందిస్తున్నట్లు ఉపాధి పథకం అధికారులు తెలిపారు. లింగపాలెం మండలంలో నిర్మిస్తున్న ఇళ్లను అంబుడ్స్ పర్సన్ ఏ ఎం భాష, ఏపీఓ వరలక్ష్మి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఉపాధి జాబ్ కార్డులుఉన్న

లబ్ధిదారులు వారి ఇళ్ళ నిర్మాణానికి 90 రోజులు పనులు పూర్తి చేసుకుంటే వారికి రోజుకు రూ.272లు చొప్పున మొత్తం రూ 24,840లు నగదు ఒక్కొక్క ఇంటికి అందించినట్లు వెల్లడించారు. లింగపాలెం మండలంలో ఇప్పటికి 800 ఇళ్లకు సంబంధించి దాదాపు రూ.2.99 కోట్లు నగదు అందించామని తెలిపారు. మరో 400 ఇళ్లను నిర్మించుకోవలసి ఉందని వీటిని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వీరు కోరారు. కొత్తగా రోజువారి వేతనం ధర పెరిగిందని ఇకపై పెరిగిన ధరను అందిస్తామన్నారు. రోజువారి వేతనం రూ.28లు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. ఇకపై రూ.272 నుంచి రూ.300లకు వేతనం పెరిగిందని పేర్కొన్నారు. నిర్మాణాలు జరిగిన ఇళ్లను పరిశీలించిన అధికారులు సంతృప్తి చెందారు.

ప్రజాగళంకు పెద్ద ఎత్తున తరలి వెళ్లిన కార్యకర్తలు

విశాలాంధ్ర-పోడూరు : పాలకొల్లులో శుక్రవారం జరిగిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ప్రజాగళంలో పాల్గొనేందుకు పోడూరు మండలంలోని వివిధ గ్రామాల నుండి నాయకులు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు మండలంలోని పాలకొల్లు నియోజక వర్గం పరిధిలోని జిన్నూరు వేడంగి కొమ్ముచిక్కాల గ్రామాల నుండి తెలుగుదేశం బిజెపి జనసేన

నాయకులు కార్యకర్తలు ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, మోటార్ సైకిళ్లపై పెద్ద ఎత్తున ర్యాలీగా తరలి వెళ్లారు వేడంగిలో నియోజకవర్గ బిజెపి నాయకులు యర్రంశెట్టి పద్మారావు, టిడిపి నాయకులు కొండేటి ప్రసాద్, జనసేన నాయకులు బొలిశెట్టి నాగ రమేష్ ఆధ్వర్యంలోప్రజాగళంలో పాల్గొనేందుకు ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ బయలుదేరి వెళ్లారు. ఆచంట నియోజకవర్గ పరిధిలోని పోడూరు కవిటం తదితర గ్రామాల నుండి కూటమి శ్రేణులు ర్యాలీగా వెళ్లారు.

శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం భర్త వెంకటేశ్వరరావు, కుమారుడు హితేష్‌తో కలసి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ప్రదక్షిణలు అనంతరం స్వామివారిని, అమ్మవార్లను అంతరాలయం ద్వారా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు పలికారు. ఈసందర్భంగా కలసిన విలేకర్లతో మాట్లాడుతూ రాజమండ్రి పార్లమెంటు స్థానానికి కూటమి అభ్యర్థినిగా పోటీచేస్తున్నానన్నారు. రాష్ట్రప్రజలందరూ మార్పును ఆకాంక్షిస్తున్నారని, మే13న జరిగే ఎన్నికలో ఆ మార్పువస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీనివాసరావు, మొగతడకల శ్రీనివాసరావు, యిమ్మడి రత్నాజి, సుంకవల్లి బ్రహ్మయ్య, యేపూరి దాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పాటుపడిన మహనీయుడు

జిల్లాలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : అంటరాని వారికి సమానత్వం కోసం పాటు పడిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కాకినాడ జిల్లా జెసియస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘు రామ్ కొనియాడారు. అన్నారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా రఘురామ్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బీహార్లోని వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన స్వాతంత్ర్య సమర యోధులే కాకుండా రాజకీయవేత్త కుడా అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చెరుకూరి జయరాజు, గొల్లపల్లి శ్రీను, రెడ్డి భాను ప్రతాప్, నీలపల్లి అప్పారావు, కోరడా సుబ్బారావు, దత్తి శ్రీనివాసు,పాల్గొన్నారు.



విశాలాంధ్ర - యు కొత్తపల్లి : దేశ ఉప ప్రధాని, దళిత నాయకుడు డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా ఏంఆర్‌పి ఎస్ మండల అధ్యక్షులు మోర్త రవి మాదిగ పాల్గొని చిత్ర పటలకు పూల మాలలు వేసి ఘన నివ్వాళ్లు అర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దేశ తొలి దళిత ఉప ప్రధానిగా చేసారని, 33 సంవత్సరాలు మంత్రిగా చేసిన ఘననీయుడు జగజ్జివన్ రామ్ అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఏంఐఎఫ్ జిల్లా నాయకులు సిద్దాంతపు బెన్ జాన్సన్, సవరపు వీర్రాజు, దూలపల్లి అప్పారావు, మోర్త వెంకట రమణ, కంద్రకోట నాని, ధన్నిబాబు, కుమార్, నాని, విజయ్, ప్రకాష్, వాసు, పాల్గొన్నారు.

విశాలాంధ్ర- పెరవలి : స్వతంత్ర సమరయోధులు సంఘసంస్కర్త భారత దేశం మాజీ ఉప ప్రధాని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దళితుల ఆరాధ్య దైవం డాక్టర్ బాబు జగజీవన్ రామ్116 జయంతి సందర్భంగా శుక్రవారం పెరవలి మండలంలోని పలు గ్రామాలలో ఆయన విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జగజ్జీవన రామ్ గొప్ప తనాన్ని జ్ఞాపకం చేసుకున్నారు.

విశాలాంధ్ర - మలకపల్లి : బాబూ జగజీవనరామ్ జయంతి సందర్భంగా కొవ్వూరు మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ నియోజకవర్గం లోని మలకపల్లి గ్రామంలో నిరుపేదలకు మరియు వికలాంగులకు సుమారు 30 కుటుంబాలకు 15 కేజీల నాణ్యమైన బియ్యం ఉచితంగా అంద జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కుంటుముక్కల కేశవ నారాయణ, గెద్దం సూర్యరావు, గెద్దం జగజీవన్, ఖండెల్లి గణేష్, మరపట్ల చంటిరాజు,దాసరి రాజ బాబు, గెద్దం శ్యాం, పరిటాల సురేష్ దువ్వపు సతీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రాజానగరం : సామాన్య రైతు కుటుంబంలో జన్మించి స్వాతంత్ర్య సమర యోధుడుగా, దేశ ఉపప్రధానిగా సేవలందించిన బాబు జగజీవన్ రాం 116వ జయంతి వేడుకలు మండలంలో శుక్రవారం ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు ఆధ్వర్యంలో జగ్జీవన్ రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనిలో భాగంగా విసి మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి నిస్వార్ధమైన సేవలందించిన బాబు జగజీవన్ రాం వంటి మహనీయులు జీవిత చరిత్రలను అధ్యాపకులు,తల్లిదండ్రులు కలిసి విద్యార్ధులకు బోధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండలంలో భారత తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రావ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి మండలంలోని ఆ గ్రామాల్లో ఉన్న బాబు జగజీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవరపల్లిలో ఎంపీపీ కేవీకే దుర్గారావు సర్పంచ్ కడిమి వీర కుమారి మాజీ ఎంపీటీసీ కడిమి రాజు డి గంగాధర్ పచ్చ రాం గోపాల్ మాధవరం వెంకటేశ్వరరావ తాతపూడి సురేష్ పుష్పానందం వినయ్ బాబు సిర్ర రాజు కోడి సూరి తదితరులు పాల్గొని జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దుదుకూరులో బాబు జగజీవన్ రావ్ విగ్రహానికి సర్పంచ్ బొంత నాగమణి సొసైటీ అధ్యక్షులు కాండ్రు రామకృష్ణ కొడవటి బుచ్చిబాబు గాలికి సువర్ణ రాజ మల్లిపూడి ప్రసాద శంకరయ్య బాబు గౌడ గాలికి రాజు తదితరులు పాల్గొన్నారు పూలమాలవేసి నివాళులర్పించారు.

విశాలాంధ్ర - నిడదవోలు : మండలంలోని సింగవరం గ్రామంలో దళిత వర్గాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి నిడదవోలు శాసనసభ్యులు జి శ్రీనివాస్ నాయుడు దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెట్టే రాజు నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సింగవరం సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స చందు, ముదునూరి జగదీష్ పూలమాలతో నివాళులర్పించారు. హరిత విప్లవం కార్మికులకు కనీస వేతనం వంటి చట్టాలు అమల్లోకి తీసుకొచ్చిన ఘనత బాపూజీకే దక్కుతుందని అన్నారు. కోట్లాదిమంది అణగారిన వర్గాల ప్రజల జీవితాలు చైతన్యం నింపిన చైతన్య మూర్తి బాబూ జగ్జీవన్ రామ్ కు నేటికీ భారతరత్న ప్రకటించకపోవడం బాధాకరమని బాబూజీకి భారతరత్న ప్రకటిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుంధతి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - గోపాలపురం : రాజ్యాంగ నిర్మాణ స్ఫూర్తి, సామాజిక అభివృద్ధి ప్రదాతగా దేశానికి వన్నె తెచ్చిన మహోన్నతుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని పలువురు కొనియాడారు. మండలంలోని వాడ వాడల డాక్టర్ బాబు జగ్జీవన్ రాం 116వ జయంతి వేడుకలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అత్యంత ఘనంగా నిర్వహించారు. భారతదేశానికి ఉప ప్రధానిగా సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మండలంలోని గోపాలపురంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ యువత ఆధ్వర్యంలో ఆయన పుట్టిన రోజున ఘనంగా నిర్వహించుకున్నారు. వాదాలకుంట లోని బాబు జగ్జీవన్ యువత ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలేసి నివాళులర్పించారు. కోమటికుంట వేళ్ళ చింతలగూడెం జగన్నాధపురం చిట్యాల కొవ్వూరుపాడు దొండపూడి రాజంపాలెం గోపవరం అధికార గ్రామాలలో విగ్రహానికి పూల మాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జొన్న కూటి మణెమ్మ మాజీ సర్పంచ్ కానేటి వీరరాఘవులు, ప్రతిపాటి రాంబాబు రాపాక ఫణి కిషోర్, గెల్లా శ్రీను, కోనపాము ప్రసాద్, మల్లిపూడి సుబ్బారావు, బొబ్బిలి వెంకటరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఏలేశ్వరం : బాబు జగజ్జీవన్ రామ్ జన హృద యాలను గెలిచిన రాజకీయవేత్త అని పలువురు కొనియాడారు. ఈ సందర్భం గా ఆయన 116వ జయంతిని పురస్క రించుకొని స్థానిక పెద్దవీధి దళిత వాడ లో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు స్థానిక మెయిన్ రోడ్‌లో ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు అనంతారపు రాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు.

విశాలాంధ్ర బ్యూరో -రాజమహేంద్రవరం : డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ కార్యాలయంలో రీజనల్ విజిలెన్స్ ఎస్.పి. కె.ఎస్.ఎస్.వి. సుబ్బారెడ్డి, డా. బాబు జగ్జీవన్ రామ్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా కెఎస్ఎస్‌విసుబ్బారెడ్డి మాట్లాడుతూ డా. బాబు జగ్జీవన్ రామ్ గారు పేరొందిన స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త అని పేర్కొన్నారు. భారత రాజ్యాంగములో ప్రతిష్టాత్మకమైన సామాజిక న్యాయ సూత్రాల యొక్క ప్రాముఖ్యత పై అధిక ప్రాధాన్యత ఇచ్చిన కొద్ది మందిలో ఈయన కూడా ఒక్కరు అని పేర్కొన్నారు. బాబుజీగా ప్రఖ్యాతిగాంచిన జగ్జీవన్ రామ్ అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు .

విశాలాంధ్ర - రౌతులపూడి : దేశానికి ఉప ప్రధానిగా సేవలందించిన బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని మండల కేంద్రమైన రౌతులపూడిలో కాకినాడ జిల్లా దళిత ప్రగతి ఐక్య సంఘం అధ్యక్షులు బత్తిన అప్పారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ బిఎస్‌పి పార్టీ కన్వీనర్ కొత్తపల్లి అర్జున్ రావు నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత దేశానికి ఎన్నో విధాలుగా సేవలందించి వ్యవసాయ రంగంలో హరిత విప్లవానికి పునాది వేసిన దేశభక్తుడు బాబు జగజీవన్ రామ్ అని బత్తిన అప్పారావు ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్ర మాల మహానాడు వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కట్టు సత్యనారాయణ, అంబేద్కర్ ఇండియన్ మిషన్ శంకవరం మండల అధ్యక్షులు అపురూప్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాకినాడ : భారతదేశం పునాదికి, భవిష్యత్తుకు నాంది పలికిన గొప్ప వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని, దేశానికి ఎన్నో రకాలుగా సేవలు అందించి మనందరికీ స్ఫూర్తిగా నిలిచారని జిల్లా కలెక్టర్ జె నివాస్ పేర్కొన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, భారత తొలి ఉప ప్రధాని డా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం కాకినాడ ఇంద్రపాలెం లెడీస్ లయన్స్ క్లబ్ వద్ద జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ జె నివాస్, జాయింట్ కలెక్టర్ ఎస్‌రామ్ సుందర్ రెడ్డి, జెడ్పీ సీఈవో ఎ శ్రీరామ చంద్ర మూర్తి, కాకినాడ కమిషనర్ జె వెంకటరావు, ఇతర ప్రజాసంఘాల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జెడి రమణ మూర్తి, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటి సభ్యులు, సంక్షేమ శాఖ అధికారులు, వివిధ ప్రజాసంఘాలు నాయకులు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మామిడికుదురు : మామిడికుదురు దీప్తి డిగ్రీ, జూనియర్, నగరం సాయి దీప్తి జూనియర్ కళాశాలల్లో దేశ మాజీ ఉప ప్రధాని స్వతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి విద్యా సంస్థలు చైర్మన్ డివివి సత్యనారాయణ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన అడుగుజాడలే అందరికీ ఆదర్శమని అధ్యాపకులు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రిన్సిపాల్ మోకా రంగారావు, జక్కంపూడి శివ ప్రసాద్, గుబ్బల ఏడుకొండలు, విప్పర్తి కోటేశ్వరరావు, అడబాల ఈశ్వరరావు, గుబ్బల ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెద్దాపురం : బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగజ్జీవన్ రామ్ నిరంత దళితుల ఉద్దరణకు పాడుపడ్డారని పలువురు మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. స్థానిక ఆర్టీఓ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్టీఓ జేఎస్ రామారావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి జగజ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుబ్రహ్మణ్యం, డీటీ భానుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని కొండయ్యపేటలో బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం ఉప్పాడ బస్టాండ్ సెంటర్ వద్ద బాబు జగజీవన్ రావు 116వ జయంతి పురస్కరించుకొని రిక్షా కార్మిక సంఘం సిఐటియు అనుబంధం వారు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రిక్షా కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు పెదపాటి సత్యనారాయణ, నూకరాజు మాట్లాడుతూ భారతదేశానికి ఉప ప్రధానిగా చేసిన జగజ్జీవన్ రావు ప్రజలకు చేసిన సేవలు మరువలేవని అన్నారు. ఈయన ఆశయాలు ముందుకు తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ పి నాగేశ్వరరావు, కొల్లు రాజబాబు, రాజబ్బాయి, సత్తిబాబు, వై నూకరాజు, సిహెచ్ సోమరాజు, సిఐటియు కుంచే చిన్న, కోనేటి రాజు, కరణం, విశ్వనాథం, కే నాగేశ్వరరావు, వై సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: అణగారిన వర్గాలకు బలమైన ప్రతినిధిగా నిలిచిన మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ సేవలు నిరుపమానమని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు ప్రస్తుతించారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక 30 వ వార్డు చర్చి పేటలో రాజమండ్రి వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాటం రజనీ కాంత్ నేతృత్వంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభ కు ఎంపీ మార్గాని భరత్ రామ్ అధ్యక్షత వహించారు. తొలుత బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రౌతు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంటరాని తనాన్ని నిర్మూలనకు జగ్జీవన్ రామ్ చేసిన కృషి మరపురానిదని అన్నారు. పాకిస్థాన్ తో భారత్ యుద్ధ సమయంలో జగ్జీవన్ కేంద్ర రక్షణ మంత్రి గా కీలకంగా వ్యవహరించిన తీరు అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో రాజమండ్రి వైకాపా పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు నక్కా శ్రీ నగేష్, వార్డు ఇన్‌చార్జ్ ఆముదాల ప్రియాంక, కానుబోయిన సాగర్, వై.ఉదయ్ భాస్కర్, కోరుమిల్లి శాంతి స్వరూప్, తదితరులు పాల్గొన్నారు

విశాలాంధ్ర - తాళ్ళపూడి: బాబూ జగజీవనరామ్ జన్మదిన సంద ర్భంగా

కొవ్వూరు లోని మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ నియోజకవర్గం లోని తాళ్లపూడి మండలం, మలకపల్లి గ్రామంలో నిరుపేదలకు, వికలాంగు లకు సుమారు 20 కుటుంబాలకు 15 కేజీలు నాణ్యమైన బియ్యం ఉచితంగా గ్రామం నాయకులు కుంటుముక్కల కేశవ నారాయణ, మద్దిపాటి ప్రకాశరావు, గెద్దం సూర్యరావు, గెద్దం జగజీవన్, ఖండెల్లి గణేష్, మరపట్ల చంటిరాజు,దాసరి రాజబాబు ద్వారా అందజేశారు ఈ కార్య క్రమంలో శ్యాం, పరిటాల సురేష్ దువ్వపు సతీష్, ముప్పిడి ప్రసాద్ పాల్గొన్నారు.

పలువురు వైసీపీలో చేరిక

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం గ్రామానికి చెందిన వై సత్తిబాబు, ఎంచిరంజీవి, ఎం సుబ్బ రాజు, ఎం బ్రహ్మాజీ, ఎం పెద్దయ్య, వి ప్రసాద్, ఎం ప్రసాద్, ఎం సు వార్త రాజు, వి గోపి, ఎం నటరాజు, వై రాము, ఎం వెంకటేష్, ఎం సతీష్, వి బాలాజీ, ఎం చరణ్, ఎస్ రాజు తదితరులు కొత్తపేట నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

రాజమహేంద్రవరం ఫొటో -3

సూర్యనారాయణ రెడ్డికి రైసుమిల్ కార్మికుల మద్దతు

విశాలాంధ్ర - అనపర్తి : ఎన్నికల ప్రచా రంలో భాగంగా మండ లంలోని పలు రైస్ మిల్లు లో పని చేస్తున్న కార్మికు లను డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి శుక్రవారం కలిసి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి గెలిపించాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయడం జరిగిందని కార్మికులకు వివరించారు.కాగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డినే మరో సారి గెలిపించుకుంటామంటూ కార్మికులు ఎమ్మెల్యే సత్తికి మద్దతు తెలిపారు.

విశాలాంధ్ర - దేవరపల్లి : యర్నగూడెం పార్డ్ ఇం డియా రిజిస్టర్ ఆఫీస్ లో ఉచిత కంప్యూటర్ శిక్షణ సెంటర్‌ని యర్నగూడెం జూని యర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఛత్రపతి శివాజీ ప్రారంబిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సి పల్ శివాజీ మాట్లాడుతూ పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవ సంస్థ సమ్మర్ ఉచిత కంప్యూటర్ శిక్షణ ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ నాలెడ్జ్ ఇవ్వ డం చాలా సంతోషకరమైన విషయమని సంస్థ ఫౌండర్ వీరా స్వామి గార్ని సంస్థ ఎక్జిక్యూటివ్ మెంబెర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు గారు మాట్లా డుతూ విద్యార్థులు అందరూ క్రమశిక్షణ తో చదువుకొని మంచి స్కిల్ తో ముందుకు వెళ్లాలని ఇలాంటి సమ్మర్ క్యాంప్స్ ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ శిక్షణ కేంద్రం మే 31 జరుగుతుందనీ అన్నారు.ఈ కార్య క్రమంలో ఎక్జిక్యూటివ్ సభ్యులు దుబకుంట్ల రాజారావు గారు,సోమీసెట్టి వెంకట్రావ్, గాలింకి హేమంత్, కొంపెల్లి బాబురావు, హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు గంజి పవన్,విద్యార్థిని విద్యార్థులు,హాజరు అయ్యారు.

ఎస్‌పల్లిపాలెంలో విశ్వరూప్ ప్రచారం

విశాలాంధ్ర - అల్లవరం : అల్లవరం మండలం ఎస్ పల్లిపాలెంలో గడప గడపకు తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలి అని ఓటర్లను అమలాపురం నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అభ్యర్దించారు. ఆయన వెంట వైకాపా నాయకులు చెల్లబోయిన శ్రీనివాసరావు, ఉండ్రు వెంకటేష్, సరేళ్ల రామకృష్ణ, తిరుకోటి సతీష్, జడిపిటిసి పందిరి శ్రీహరి, శేషారావు, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి సన్నిధిలో సినీ హీరో అశ్విన్

విశాలాంధ్ర - అన్నవరం : అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారిని సినీ హీరో అశ్విన్ బాబు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో పిఆర్ఓ కృష్ణారావు స్వాగతం పలికారు. అశ్విన్ వ్రతం ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానానికి రూ.10,116లు, గోశాల ట్రస్ట్‌కు విరాళంగా అందజేశారు.

వైసీపీని తుంగలో తొక్కబోతున్నాం : ఎంపీ అభ్యర్థి తంగెళ్ళ

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : దుర్మార్గపు, రాక్షస పరిపాలనతో ప్రజలను పట్టి పీడిస్తోన్న వైసీపీని తుంగలో తొక్క బోతున్నాం..జనసేన, తెలుగు దేశం, భారతీయ జనతా పార్టీ కూటమిగా మనం గెలవబోతోన్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు స్పష్టం చేశారు. కాకినాడ కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ నేతృత్వంలో తునిలో శుక్రవారం జరిగిన తుని నియోజకవర్గం పార్టీ సర్వసభ్య ఆత్మీయ సమావేశంలో నాగబాబు ముఖ్య అతిథిగా హాజరై వందలాది మంది కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ మాట్లాడారు. స్థానిక తుని నియోజకవర్గం శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి దాడిశెట్టి రాజా నెం 1 క్రిమినల్ అని నాగబాబు ఆరోపించారు. జగన్ రెడ్డికి సానుభూతితో ఓటు వేస్తే సుసంపన్నమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని చెప్పారు. ఈసారి మాత్రం మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. పిఠాపురం నియోజకవర్గం శాసనసభ్యులుగా పవన్ కళ్యాణ్‌ని, కాకినాడ లోక్ సభ సభ్యుడిగా తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ని భారీ మెజారిటీతో గెలిపించుకుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న కూటమి భాగస్వామ్య పార్టీ ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో కాకినాడ జిల్లాను అభివృద్ధి చేసు కోవచ్చని తెలిపారు. రానున్న కూటమి ప్రభుత్వంలో అభివృద్ధితో కూడిన సంక్షేమ పథకాలపై ప్రధాన దృష్టి ఉంటుందని నాగబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్, కాకినాడ లోక్ సభ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ప్రముఖ సినీ దర్శకులు మెహర్ రమేష్, జనసేన ఎన్ఆర్ఐ విభాగం ఆస్ట్రేలియా కన్వీనర్ కొలికొండ శశిధర్, జనసేన అధికార ప్రతినిధి దాసరి కిరణ్, తుని నియోజకవర్గం సమన్వయకర్త చోడిశెట్టి గణేష్, జిల్లా కార్యదర్శి వంగలపుడి నాగేంద్ర, వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ ప్రతినిధులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

నిమ్న కులస్తులకు వెన్నుదన్నుగా నిలిచిన మహానీయుడు జగ్జీవన్‌రామ్



విశాలాంధ్ర - తాళ్ళపూడి : ప్రభుత్వ ఆదేశాల మేరకు బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి ని రాష్ట్ర ఉత్సవం గా చేయటం లో భాగంగా తాళ్ళపూడి తహశీల్దార్ కార్యాలయంలో జగజ్జివన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుల అర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సి.హెచ్ శ్రీనివాస రావు మాట్లాడుతూ అణగారిన జీవితాలు గా ఉన్న నిమ్న కులస్తులకు వెన్ను దన్నుగా ఉండి ఉప ప్రధానిగా ఎదిగిన మహనీయుడు అని కొనియాడారు.ఆర్ఐ కిషోర్, విఆర్‌ఓలు కావూరి నాగేశ్వరరావు, ప్రవీణ్, సంజీవ రావు పాల్గొన్నారు.

దేశప్రగతిలో జగ్జీవన్‌రామ్ పాత్ర మరువలేనిది

విశాలాంధ్ర - రాజమహేం ద్రవరం : స్థానిక 14వ వార్డ్ వైసిపీ ఇంఛార్జి, ఆర్యాపురం మాజీ బ్యాంక్ డైరెక్టర్ పెంకె సురేష్ కుమార్ వార్డు కార్యాలయంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఈతకోటి భాపన సుధారాణి,సురేష్ కుమార్ పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ బీహార్‌లోని అర్రా సమీపంలోని చంద్వాలో 1908, ఏప్రిల్ 5న సోభీ రామ్,వాసంతి దేవి దంపతులకు జన్మించిన జగజీవన్ రామ్ అంటరానితనం ఎలా ఉంటుందో చిన్నతనంలోనే చవిచూసి, దాన్ని రూపుమాపడానికి కృషిచేశారని పేర్కొన్నారు.చిన్నవయస్సులోనే తండ్రిని పోగొట్టుకోవడంతో చదువుకుంటే ఏదైనా సాధించవచ్చని భావించి,ఎన్నో ఒడిదుకులు ఎదుర్కొంటూ కష్టపడి చదువుకుని బి.ఎస్.సి.డిగ్రీ సాధించారని అన్నారు. అంటరానితనం నిర్మూలన ఉద్యమం తో పాటు ఎన్నో ఉద్యమాల్లో పాల్గొనిఅణగారిన వర్గాలను చదువుపైపు మళ్లించారని అన్నారు. జగజీవన్ రామ్ వంటి మహనీయుడిని ఆదర్శంగా తీసుకుని అందరూ ఉన్నత స్థాయికి చేరాలని, మన జాతికి గౌరవం తేవాలని సుధారాణి పిలుపు నిచ్చారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో జోన్నాడ విల్సన్, పలివెల ప్రకాష్,మోర్స శివకృష్ణ,నగిరి చిన్ని, కాండ్రకోట దుర్గా ప్రసాద్, సావ్వేటి సింహాచలం,తోట బుజ్జి,బోను నాగరాజు,చంద్రమోహన్,బోగారపు మహేష్, కర్రి శ్రీనివాసరావు,చల్లా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ నుంచి వైసీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండలం కేంద్రంలో వెలిచేరు గ్రామం నుండి మాజీ ఎంపీటీసీ పెరవలి సురేష్, వందే నాగరాజు, తొర్లపాటి పృథ్వీ, పంబల సందీప్ తేజ, వారా గణేష్ (యూత్ లీడర్), చీలి కార్తిక్, ఎల్లే సురేష్, మలక ప్రశాంత్ కుమార్, ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గ్రామం నుండి పుట్టా లక్ష్మీ నారాయణ, అడ్డాల శివ దుర్గాప్రసాద్, చల్లపూడి సత్యనారాయణ, జాన వీరబాబు, మిద్దె నాగబాబు, ఏరికే నాగన్న, నెల్లి శివకేశవరెడ్డిలు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

జగనన్నను సీఎం చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా ముమ్మిడివరం నియోజవర్గం తాళ్ళరేవు మండలం పటవల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం ఎన్నికల ప్రచార కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పితాని బాలకృష్ణలు ముఖ్య అతిధులుగా విచ్చేసారు. ముందుగా కొత్తూరు మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బారీ స్థాయిలో స్కూటర్ ర్యాలీగా పటవల, శాంతి మూల, రాఘవేంద్ర పురం, కొత్తూరు కాలనీ, యాదవుల కాలనీలలో గడపగడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించి మళ్ళీ జగనన్నను సీఎంను చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, జిల్లా పరిషత్ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఎమ్‌పీటీసీ సభ్యులు తణుకు వరలక్ష్మి సత్తిబాబు, కన్వీనర్ కాలా వెంకటరమణ, వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, పార్టీ అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్, స్థానిక నాయుకులు కొప్పిశెట్టి వెంకట్, కొటికలపూడి చంద్రశేఖర్, చెక్క పల్లి లక్ష్మణ్, కృష్ణ, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

బెండమూర్లంకలో ఆనందరావు విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - అల్లవరం : అల్లవరం మండల అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో బెండమూర్లంక గ్రామ కమిటీ అధ్యక్షులు యాళ్ల కాసు బాబు అధ్యక్షత అమలాపురం మాజీ ఎమ్మెల్యే అమలాపురం తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి అయితా బత్తుల ఆనందరావు ఇంటి ఇంటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి చంద్రబాబుని ముఖ్య మంత్రి చేయాలి అని అలాగే రెండు ఓట్లు సైకిల్ గుర్తుకి ఓటు వేయాలి అని ఓటర్స్‌ని అభ్యర్థంచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామి నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి కర్రి రామస్వామి, తెలుగు యువత నాయకులు రాష్ట్ర తెలుగు యువత నాయకులు చెరుకూరి సాయిరాం, పెచ్చేట్టి విజయలక్ష్మి, గోసంగి అరిగెల నానాజీ, మల్లుల పోలయ్య, నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, కొల్లు విష్ణుమూర్తి, బొర్రా ఈశ్వరావు, సాధనాల రమేష్, సాధనాల నాగబాబు, జనసేన నాయకులు గుర్రం కృష్ణ, నల్లా శ్రీధర్, లింగోలు పండు, ఇసుక పట్ల రఘు బాబు, పిండి రాజా, ఆకుల బుజ్జి, చిక్కాల సతీష్, మోకా బాలయోగి, కొప్పుల నాగ మానస, గండి స్వామి, గుర్రం రాజీవ్, పదాల నానాజీ, ఈలి వెంకన్న, కంకిపాటి చిన్న వీరబాబు, అయితాబత్తుల ఉమా మహేశ్వరరావు, శిరంగు కుమార్, బీజేపీ లింగం చిన్ని, పోలి శెట్టి భాస్కరావు, కోప్పుల సత్తిబాబు, షేక్ హుస్సేన్, నల్లా స్వామి, చిక్కాల గణేష్, దున్నాల దుర్గ, ఆకేటి పెద్ద గోలకోటి చిన్నా, బండి గుప్తాపు సత్తిబాబు, వేగి రాజు వెంకటరాజు, కడలి వెంకటేశ్వర రావు, దాట్ల గోపిరాజు, పోతుల నాగ రాజు, గంధం శ్రీను, కాండ్రేకులవీర వెంకటసత్యనారాయణ, పరసా కిరణ్, నల్లా నాగరాజు, కలిగిరి సత్యనారాయణ, కాకిలేటి సూరిబాబు, దాట్ల గోపి రాజు, పచ్చి మాల ఏడుకొండలు, కొప్పాడి నాగబాబు, కడలి విజయ్, కడలి దేవి ప్రసాద్, ముసునూరి ఏడు కొండలు, ముసునూరి తాత రావు, బొర్రా రాజేష్, వుల్లింగి శ్రీను, దోమ్మేటి రామకృష్ణ, పోతుల అప్పారావు, కైలా వెంకటరావు, కిరణ్, కడలి కైరం రాము, కడలి సత్యనారాయణ, రాయపు రెడ్డి సూరిబాబు, నల్లా సుబ్బారావు, గుమ్మళ్ళ చిన్నా, గంధం శ్రీను, పోతుల బుజ్జి, పెమ్మి రెడ్డి సురేష్, అయితా బత్తుల అజయ్, నంద్యాల ప్రకాష్, వడ్డీ రాంబాబు మరియు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాలుగోన్నారు.

పింఛన్ల కోసం ఇంకా పడిగాపులు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ప్రతి నెలా 1వ తేదీనే పెన్షన్లు తీసుకునే అవ్వాతాతలు జగన్ మోహన్‌రెడ్డి నిర్వాకం వల్ల వాటి కోసం ఇంకా పడి గాపులు కాస్తున్నారని తెలుగు దేశం పార్టీ నగర కమిటీ అధ్యక్షులు బుడ్డిగ రాధా ఆవేదన వ్యక్తం చేశారు. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో జనసేన - బీజేపీ నాయకులతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాధా మాట్లాడారు. అవ్వాతాతలకు మనుమడిని.. పెద్ద కొడుకుని అంటూనే వారిని రోడ్డుపై నడిపిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే పెన్షన్లు అందించే వీరుడు జగన్ ఈ నెల ఎందుకు ఆలస్యం చేశాడని ప్రశ్నించారు. తన పన్నెపోయిందని ముందే తెలుసుకున్న జగన్ తన సొంత కాంట్రాక్టర్లకు పెన్షన్ల సొమ్మును బిల్లులుగా కాంట్రాక్టర్లకు చెల్లించేశాడని ఆరోపించారు. పెన్షన్లకు సంబంధించిచాలా మంది ఖాతాల్లో ఇంకా డబ్బులే పడలేదన్నారు. వచ్చే నెల అయిన సక్రమంగా 1వ తేదీనే పెన్షన్లు పంపిణీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షులు సబ్బా రాజేష్‌కన్నా, బీజేపీ నాయకులు కందికొండ రమేష్‌లు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని, అయితే వాలంటీర్లు లేకపోతే వ్యవస్థలు పని చేయవన్నట్టు చెప్పడం సరికాదన్నారు. వాలంటీర్లు లేకపోతే పెన్షన్లు ఇవ్వరా అని ప్రశ్నించారు. దీని బట్టి చూస్తే ఎన్నికల కోసం 2.60 లక్షల మంది సైన్యాన్ని జగన్ ఏర్పాటు చేసుకున్నట్టు ఉందన్నారు. మీడియా సమావేశంలో మాజీ కార్పొరేటర్ తంగెళ్ళ బాబీ, బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి బూర రామచంద్రరావు, జనసేన పార్టీ నగర కార్యదర్శి ముమ్మిడి నాగరాజు పాల్గొన్నారు.